క్లుప్తంగా

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

బిచ్కుంద(జుక్కల్): మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని ఎస్సై మురళి తల్లిదండ్రులకు సూచించారు. గురువారం బిచ్కుందలో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే కుటుంబ పెద్దలపై కేసు నమోదు చేస్తామని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించినప్పుడే ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా ఇంటికి చేరుకోవచ్చని అన్నారు. చాలా మంది వాహదారులు నెంబర్ ప్లేటు లేకుండా వాహనాలు నడుపుతున్నారని, అది చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా నెంబరు ప్లేట్లు ఉండాలని సూచించారు. నెంబరు కనబడే విధంగా ఉండాలి.. దానిపై ఎలాంటి రాతలు ఉండకూడదన్నారు. చాలామంది వాహనంపై సంబంధం లేకపోయినా ప్రెస్, పోలీస్ స్టిక్కర్లు అంటించి తిప్పుతున్నారని, త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు అన్ని రకాల ధ్రువపత్రాలను తమ వెంట ఉంచుకోవాలన్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించారు. పెండింగ్ చలానాలు ఉన్నట్లయితే వాహనాదారులు రాయితీపై ఆన్‌లైన్ ద్వారా కట్టేలా చర్యలు తీసుకున్నారు. ఎస్సై ఆంజనేయులు, ఏఎస్ఐ సంజీవులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఐగా బాధ్యతల స్వీకరణ

బిచ్కుంద(జుక్కల్): స్థానిక తహసీల్ కార్యాలయంలో గురువారం ఆర్ఐగా రవీందర్ బాధ్యతలు స్వీకరించారు. ఆర్ఐగా ఉన్న సాయిబాబా నిజాంసాగర్‌కు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో పిట్లం నుంచి రవీందర్ వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆర్ఐ రవీందర్ తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన అంబయ్య అనే యువకుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. 2004 సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, మిత్రులు అంబయ్య కుటుంబానికి రూ.28,500ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అంబయ్య స్నేహితులు ఆర్థిక సహాయం చేయడంతో మృతుడి కుటుంబానికి ఆసరా లభించిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

కళాశాలపై ఫిర్యాదు



బాన్సువాడ : బాన్సువాడలోని ఎస్ఎస్ఎల్ డిగ్రీ కళాశాలపై తెలంగాణ యూనివర్సిటీ అధికారికి బీసీ విద్యార్థి సంఘం నేతలు ఫిర్యాదు చేశారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్ మాట్లాడుతూ.. బాన్సువాడ శివారులోని సోమేశ్వర్‌లో గల ఎస్ఎస్ఎల్ డిగ్రీ కళాశాల యజమాన్యం విద్యార్థుల నుంచి అధికంగా పరీక్ష ఫీజులు వసూలు చేస్తోందని, పరిశోధనలకు కావాల్సిన పరికరాలు అందుబాటులో లేవని, సరిపడా అధ్యాపకులు కూడా లేరని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. యూనివర్సిటీ నిబంధనలు పాటించడం లేదని, కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గాయత్రిలో చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. బుధవారం నాటికి లక్షా 52 వేల 369 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

నగదు, నిత్యావసర సరుకుల పంపిణీ



పిట్లం(జుక్కల్): మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామంలో వడ్ల లక్ష్మి నివాసపు ఇల్లు షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలకు దగ్ధమై సర్వం కోల్పోయారు. విషయం తెలుసుకున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్టేట్ కమిటీ మెంబర్ సంజీవ్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులతో పాటు వంట సామగ్రి, రూ.10 వేల నగదును అందజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ బాన్సువాడ డివిజన్ చైర్మన్ మరగల వేణుగోపాల్, పిట్లం మండల చైర్మన్ బుగుడాల నవీన్ కుమార్, వైస్ చైర్మన్ బొడ్ల రాజు, స్థానిక గ్రామ పెద్దలు నారాయణ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చింతల సాయిరెడ్డి, హనుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదహారేళ్లుగా వైద్యుడి పోస్టు ఖాళీ

- ఫార్మాసిస్టుతోనే రోగులకు హోమియో వైద్య సేవలు
- ఇబ్బందులు పడుతున్న దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు



ఆస్పత్రిలో ఉన్న మందులు



ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ హోమియో వైద్యశాల

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): హోమియో వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు తగ్గుతాయనే నమ్మకం ప్రజలలో బాగా పెరిగింది. దీంతో ప్రజలు హోమియో వైద్యం వైపు మొగ్గు చూపుతున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని హోమియో ఆస్పత్రిలో వైద్యుడు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని హోమియో ఆస్పత్రిలో 16 ఏళ్ల క్రితం అప్పటి వైద్యులు రవీందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఇంత వరకు వైద్యుడి పోస్టు భర్తీ కాలేదు. 16 ఏళ్ల నుంచి ఆస్పత్రిలో ఫార్మాసిస్టుతోనే వైద్య సేవలు అందుతున్నాయి. ఫార్మాసిస్టు తనకు తెలిసిన వైద్యంతోనే రోగులకు మందులను అందిస్తున్నారు. కాని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మాత్రం వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు సరిపడా వైద్యం అందడం లేదు. హోమియో వైద్యంతో సైడ్ ఎఫెక్ట్ లేకపోవడంతో ప్రస్తుతం డిమాండ్ ఏర్పడింది. 16 ఏళ్లలో పలు మార్లు వైద్యుల భర్తీ, బదిలీలు జరిగినా ఎల్లారెడ్డిలో మాత్రం వైద్యుడి పోస్టు భర్తీ కాలేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఎల్లారెడ్డిలో హోమియో వైద్యుడి నియామకం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సరైన మందులు దొరకడం లేదు



హోమియో ఆస్పత్రిలో వైద్యుడు లేకపోవడంతో దీర్ఘకాలిక రోగాలకు సంబంధిచి సరియైన మందులు దొరక్క ఇబ్బందులు పడుతున్నాం. డాక్టర్‌ను భర్తీ చేస్తే స్థానికులకు ఇబ్బందులు తొలగుతాయి. అందరికి వైద్యం అందుతుంది.

– లలిత, ఎల్లారెడ్డి

ఫార్మాసిస్టే మందులిస్తున్నారు



హోమియో ఆస్పత్రిలో డాక్టర్ లేకపోవడంతో ఫార్మాసిస్టు తనకు తెలిసిన మందులను అందిస్తున్నారు. హోమియో మందులకు సైడ్ ఎఫెక్ట్ లేని కారణంగా చాలా మంది హోమియో వైద్యం వైపు చూస్తున్నారు. ఎల్లారెడ్డి ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకుని వైద్యుడిని భర్తీ చేయాలి.

– ప్రవీణ్, ఎల్లారెడ్డి

2006లో బదిలీ అయ్యారు



2006లో హోమియో డాక్టర్‌గా పని చేసిన రవీందర్‌రెడ్డి బదిలీ కావడంతో అప్పటి నుంచి పోస్టు ఖాళీగా ఉంది. పలు మార్లు వైద్యుల బదిలీలు జరిగినా ఎల్లారెడ్డికి ఎవరూ రాలేదు. వైద్యుడి ఖాళీ గురించి ఉన్నతాధికారులకు పలుమార్లు నివేదిక కూడా పంపాం.

– గోపాలకృష్ణ, ఫార్మాసిస్ట్, హోమియో ఆస్పత్రి

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి



స్వీట్లు తినిపించుకుంటున్న దివ్యాంగులు

కామారెడ్డి టౌన్: డాక్టర్ లూయిస్ బ్రెయిలీ 215 జయంతి వేడుకలను విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. దివ్యాంగులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అంధుల కోసం ప్రత్యేక లిపిని కనిపెట్టి అంధులకు విజ్ఞాన జ్యోతిని వెలిగించిన గొప్ప వ్యక్తి లూయిస్ అని సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిప్పదుర్గాప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో సబ్ కమిటీ చైర్మన్ వంగ ఈశ్వర్, సబ్ కమిటీ డైరెక్టర్ గాడి నర్సింలు, దివ్యాగులు రంగ్యానాయక్, శంకర్, కొండల్ రెడ్డి, వెంకటేశం, స్వామి, కుర్ల లింగం, మల్లయ్య, సిద్ధిరాములు, హన్మంతు, రాజమౌళి పాల్గొన్నారు.

సౌత్‌క్యాంపస్‌లో పర్యావరణ స్నేహిత క్లబ్ ప్రారంబం

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో పర్యావరణ స్నేహిత క్లబ్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ గౌడ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు స్నేహిత క్లబ్ ఏర్పాటుకు చొరవ చూపడం అభినందనీయమన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు.

కార్యక్రమంలో ప్రొఫెసర్లు రాజేశ్వరి, అంజయ్య, వీరభద్రం, నారాయణ, సునీత, శర్మ, శ్రీకాంత్, సరిత, దిలిప్, విద్యార్థులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

బల్దియా స్థలంలో నిర్మాణ పనులను నిలిపేయాలి



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్ శ్రీనివాస్

కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలోని స్వప్నలోక్ కాలనీ మున్సిపల్ ఓపెన్ స్థలంలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయించాలని 11వ వార్డు కౌన్సిలర్ కాసర్ల శ్రీనివాస్ గురువారం మున్సిపల్ కమిషనర్ దేవేందర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ స్థలంలో కొందరు అక్రమంగా భవన నిర్మాణం చేపడుతున్నారని, కాలనీవాసులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే చర్యలు చేపట్టాలని, మున్సిపల్ స్థలాలను కాపాడాలని కోరారు.

అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రయోగ పుస్తకాల పంపిణీ



పుస్తకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నెమ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రయోగాల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దుర్గాబాయి మాట్లాడుతూ.. ఈ పుస్తకాలలో విద్యార్థులు ఇంటి వద్ద లభించే వస్తువులతో సైన్స్ కృత్యాలను ఏవిధంగా తయారు చేస్తారో ఉంటుందన్నారు. వాటి వల్ల విద్యార్థులకు ఆలోచనా శక్తి పెరుగుతుందన్నారు. దీని కారణంగా సైన్స్ పట్ల విద్యార్థులకు ఆసక్తి కలుగుతుందన్నారు. ఇంటి వద్ద ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుని, ఇలాంటి సర్వీసును కల్పించినందుకు ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేష్, రమేష్, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



ఫిజియోథెరపి చేస్తున్న డాక్టర్ గంగాధర్

బాన్సువాడ రూరల్: దివ్యాంగ విద్యార్థులకు ప్రతి రోజు ఫిజియోథెరపి చేయడం వల్ల సత్ఫలితాలు వస్తాయని బాన్సువాడ భవిత కేంద్రం ఫిజియోథెరొపిస్టు గంగాధర్ అన్నారు. గురువారం భవిత కేంద్రంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులకు ఫిజియోథెరపి చేశారు. దివ్యాంగులైన విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు చేదోడు వాదోడుగా ఉండాలన్నారు. వారి వైకల్యాన్ని అవహేళన చేయకుండా ఆదరించాలన్నారు. ప్రతి గురువారం భవిత కేంద్రంలో నిర్వహించే ఫిజియోథెరపి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐఈఆర్‌పీఎస్ వెంకట పద్మ, వసంత్ కుమార్ ఉన్నారు.

మిషన్ భగీరథ నీరు లీకేజీ



పెద్దకొడప్‌గల్- బేగంపూర్ తండా రోడ్డుపై నీరు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రం నుంచి బేగంపూర్ తండాకు వెళ్లే దారిలో మిషన్ భగీరథ వాల్ లీకై నీరు వృథాగా పోతున్నాయి. నీరు ఆ మార్గంలో నిల్వ ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మట్టి రోడ్డు కావడంతో నీరు చేరి గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు చర్యలు తీసుకోని రోడ్డుపైకి నీళ్లు రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న అక్షింతల శోభాయాత్ర





నాగిరెడ్డిపేట: అక్షింతల కలశాలకు స్వాగతం పలుకుతున్న రామభక్తులు, కుప్రియాల్‌లో ..



అన్నాసాగర్‌లో..

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో అయోధ్య రాములోరి అక్షింతల శోభాయాత్ర జిల్లాలో ఘనంగా కొనసాగుతోంది. అక్షింతలతో కూడిన కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. జై శ్రీరామ్, రామ లక్ష్మణ జానకి జై బోలో హనుమాన్‌కి అంటూ నినాదాలు చేస్తూ ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. శోభాయాత్రలో ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, పలు హిందూ సంఘాల సభ్యులు, బీజేపీ నాయకులు, స్థానిక గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత



బీబీపేట: మండల కేంద్రంలోని చికెన్ సెంటర్లో పని చేస్తున్న నస్కల్ గ్రామానికి చెందిన అజీమ్ గత నెల 29న తన స్వగ్రామానికి వెళ్తున్న సమయంలో మొబైల్ పోగొట్టుకున్నాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై అనిల్, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి మొబైల్ గుర్తించారు. మొబైల్‌ను స్వాధీనం చేసుకుని గురువారం బాధితుడు అజీమ్‌కు అందజేశారు. అంతే కాకుండా గడిచిన ఏడు నెలల కాలంలో పోగొట్టుకున్న మొబైల్‌లను సీఈఐఆర్ ద్వారా గుర్తించి 36 మంది బాధితులకు అందజేసినట్లు ఎస్సై తెలిపారు.

జనవరి 6లోపు దరఖాస్తు చేసుకోండి



అయ్యపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి

జనవరి 6లోపు ప్రజాపాలన దరఖాస్తులు అందించాలని మిగిలిన అర్హులకు ప్రభుత్వ అధికారులు సూచించారు. గురువారం కూడా ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాల్లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. దరఖాస్తు కేంద్రాలను ఉన్నతాధికారులు పరిశీలించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇంకా దరఖాస్తు చేసుకోని వారు ఎవరైనా ఉంటే సర్పంచులు, ఎంపీటీసీలు వారికి సమాచారం అందించాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



చిన్నదగ్గిలో.. ఎంపీడీవో ఆనంద్



చించోలిలో..



బ్రాహ్మణపల్లిలో.. ఎంపీడీవో రాజ్‌వీర్



రాములగుట్టతండాలో.. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం



విఠల్‌వాడి గ్రామంలో .. ఎంపీడీవో రాణి



జనగామలో..



భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లిలో..



ఆర్గొండలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్



మార్దండలో మాట్లాడుతున్న ఎంపీవో బ్రహ్మం



హాజీపూర్‌లో మాట్లాడుతున్న జీపీ కార్యదర్శి

వైభవంగా గణపతి హోమం



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని అయ్యప్ప సన్నిధానంలో గురువారం వేదపండితులు విజయ్ మహారాజ్ ఆధ్వర్యంలో గణపతి హోమం, అయ్యప్పకు పూజలు వైభవంగా నిర్వహించారు. మద్నూర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో గణపతి, సుబ్రహ్మణ్యం, అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరు సుఖ శాంతులతో ఉండాలని, పాడి పంటలు బాగుండాలని కోరుతూ హోమం నిర్వహించినట్లు గురుస్వాములు తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు లక్ష్మణ్, సాయిలు, సంతోష్, కిరణ్, పింకు, శంకర్, అశోక్, పాల్గొన్నారు.

కాలభైరవ వీరాంజనేయ ఆలయ వార్షికోత్సవం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని గుమాస్తా కాలనీలో గల శ్రీ కాలభైరవ వీరాంజనేయ దేవస్థానం 19వ వార్షికోత్సవం గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, యజ్ఞహోమాలు చేపట్టారు. పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

సలాబత్‌పూర్ ఆలయ హుండీ లెక్కింపు



మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలోని హుండీల లెక్కింపును అధికారులు గురువారం చేపట్టారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆలయంలోని హుండీలను తెరిచి లెక్కించారు. మూడు నెలలకు ఒకసారి ఆలయంలోని హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని చేపడతామని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీధర్ తెలిపారు. హుండీలో రూ.1,80,360 నగదు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఆలయ సిబ్బంది వేణు, కల్పన, అర్చకులు విజయ్, అరవింద్, భక్తులున్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మోడెగాంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంక్షేమ పథకాలపై ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన పథకాల అమలు తీరును వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఇన్‌చార్జిగా మశ్చేందర్



బీబీపేట: జాతీయ బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జిగా బీబీపేటకు చెందిన తుమ్మ మశ్చేందర్ ఎన్నికయ్యారు. కామారెడ్డిలో జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మశ్చేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ, బీసీ సంక్షేమానికి తోడ్పడుతానని ఆయన అన్నారు.